DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
ఆదివారం, నవంబరు 5, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ఊపిరి ఉన్నంత వరకు బీజేపీలోనే కొనసాగుతా



హైదరాబాద్ (వాయిస్ టుడే): కొన్ని మీడియా సంస్థలు తాను పార్టీ మారుతున్నానంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నాడు బీజేపీ పార్టీ ప్రధాన కార్యాలయంలో అరుణ మీడియాతో మాట్లాడుతూ..“ తన నియోజకవర్గంలో బీజేపీ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం తాను ప్రచారంలో పాల్గొంటున్న విషయం కొన్ని పత్రికలు, ఛానళ్లకు కనిపించడం లేదా అని డీకే అరుణ ప్రశ్నించారు. తాను పార్టీ మారే ప్రసక్తే లేదని, తన ఊపిరి ఉన్నంత వరకు బీజేపీలోనే కొనసాగుతానని డీకే అరుణ స్పష్టం చేశారు. ఈ విషయంపై మరోసారి మీడియా తమ ఇష్టానుసారంగా ప్రచారాలు చేస్తే న్యాయ విచారణకు సిద్ధంగా ఉండాలని డీకే అరుణ హెచ్చరించారు.

# కాంగ్రెస్ పాలకుల చేతగాని తనంవల్లే సింగరేణిలో కేంద్రానికి 49 శాతం వాటా: సీఎం కేసీఆర్



కొత్తగూడెం (వాయిస్ టుడే): సీఎం కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో తనదైన స్పీడుతో దూసుకెళ్తున్నారు. ఇవాళ భద్రాద్రి కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. ‘భద్రాద్రి సీతారామ చంద్రస్వామి కొలువుదీరిన ఈ పావన భూమికి నేను శిరసు వంచి నమస్కరిస్తున్నా. ఆ స్వామి పేరునే ఈ జిల్లాకు పెట్టుకున్నాం. నేనో నాలుగు విషయాలు చెప్పదల్చుకున్నా. శ్రద్ధగా వినండి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయ్యింది. అయినా దేశంలో రావాల్సినంత రాజకీయ పరిణతి రాలేదు. ఎన్నికలొస్తే అబద్ధాలు చెప్పడం, బూతులు తిట్టుకోవడం, మోసపూరిత వాగ్ధానాలు. ఇదీ మన దేశంలో జరుగుతున్న తంతు’ అన్నారు.


‘ఈ దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియ ఉంది. ప్రజల చేతిలో ఉన్న ఒకే ఒక్క వజ్రాయుధం లాంటి ఆయుధం ఓటు. ఆ ఓటు ఆగమాగం వేస్తే మన తలరాత కింద మీదైతది. ప్రజలు కోరుకున్న వాళ్లు గెలిచినప్పుడే అది ప్రజల గెలుపు అయితది. కాబట్టి బాగా ఆలోచించి ఓటేయాలి. మూడు పార్టీల నుంచి ముగ్గురు అభ్యర్థులు పోటీల ఉంటరు. ఆ ముగ్గురిలో ఎవరు మంచి వ్యక్తో చూడాలి. పార్టీల వైఖరి, ఆ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులను బేరీజు వేసుకోవాలి. ప్రతి ఒక్కరూ అలా ఆలోచించి ఓటేస్తేనే రాష్ట్రానికి మంచి జరుగుతది’ అని సీఎం సూచించారు.

‘సింగరేణి కథ మీకు తెలియాలి. 134 సంవత్సరాల చరిత్ర ఉన్నది మన సింగరేణికి. తెలంగాణ కొంగు బంగారం మన సింగరేణి గనులు. ఈ సింగరేణి వందకు వందశాతం మనకే ఉండే. ఇది తెలంగాణ ఆస్తి. తెలంగాణ సొత్తు. చేతగాని దద్దమ్మ కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వం దగ్గర అప్పులు తెచ్చి.. 30-40 ఏళ్లు అప్పులు తిరిగి చెల్లించలేదు. యువకులు సింగరేణి చరిత్ర తెలుసుకోవాలి. వందశాతం తెలంగాణ ఆస్తిగా ఉన్న సింగరేణిలోంచి సమైక్య రాష్ట్రంలో చేతగాని కాంగ్రెస్ పాలకులు అప్పులు తిరిగి చెల్లించకపోవడంవల్ల కేంద్రానికి 49 శాతం వాటా వెళ్లింది. లేకపోతే వందకు వందశాతం మన గనులు, మన ఆస్తి. ఎప్పుడో నిజాం రాజు కాలంలో ప్రారంభమైన గనిలో 49 శాతం వాటా కేంద్రానికి వదులుకోవాల్సి వచ్చింది’ అని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు.

‘తెలంగాణ రాష్ట్రం వచ్చిన వెంటనే సింగరేణి నడకను మార్చినం. మొదటి అడుగులోనే 3 శాతం తెలంగాణ స్టేట్ ఇంక్రిమెంట్ ఇచ్చినం. కంపెనీ టర్నోవర్ కాంగ్రెస్ రాజ్యంలో రూ.11 వేల కోట్లు ఉండేది. దాన్ని ఈ రోజు రూ.33 వేల కోట్లకు తీసుకుపోయినం. సింగరేణి లాభాలు రూ.419 కోట్లు ఉండేది. దాన్ని రూ.2,184 కోట్లకు తీసుకుపోయినం. గతంలో కార్మికులకు పంచే లాభం ఏటా 60, 70 కోట్లు ఉండేది. కానీ ఈ దసరాకు మనం పంచిన లాభం రూ.700 కోట్లు. నూతన నియామకాల వల్ల సింగరేణి యువ కార్మికులతో కళకళలాడుతున్నది’ అని సీఎం చెప్పారు.

‘తెలంగాణ రాకముందు 6400 ఉద్యోగాలు వస్తే, తెలంగాణ వచ్చిన తర్వాత తొమ్మిదిన్నర ఏళ్లలో 19,463 మంది ఉద్యోగాలిచ్చినం. డిపెండెంట్ ఉద్యోగాలు ఊడగొట్టిందే కాంగ్రెస్ యూనియన్. బీఆర్ఎస్ గవర్నమెంట్ వచ్చినంకనే డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాం. దాని ద్వారా 15,256 మందికి డిపెండెంట్ ఉద్యోగాలిచ్చాం. గతంలో కార్మికులు చనిపోతే ఒక లక్ష రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకునేవాళ్లు . ఇప్పుడు రూ.10 లక్షలు ఇస్తున్నం. డిపెండెంట్ ఉద్యోగం తీసుకోకపోతే రూ.25 లక్షలు ఇస్తున్నం. కార్మికులు తీసుకునే ఇంటి రుణానికి వడ్డీ మొత్తం సింగరేణి చెల్లిస్తున్నది. రూ.10 లక్షలు వడ్డీలేని రుణాలు ఇస్తున్నది. సింగరేణి స్థలాల్లో నివాసం ఉంటున్న 22 వేల మందికి జీవో 76 ద్వారా ఇళ్ల పట్టాలు అందజేయడం జరిగింది’ అని ముఖ్యమంత్రి తెలిపారు.

# ఈ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి .. ఏయే స్థానాల్లో పోటీ చేయబోతోందంటే..?



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం పార్టీ పోటీ చేయనుంది. ఈ మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. పార్టీ చేసే 14 స్థానాలకు సీపీఎం పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. మరో 3స్థానాలకు రెండు రోజుల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీతో పొత్తు కోసం సీపీఎం పార్టీ సిద్ధమైంది. కానీ కాంగ్రెస్ పార్టీ సరైన నిర్ణయం చెప్పకపోవడంతో సీపీఎం పార్టీ ఒంటరిగానే పోటీచేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈమేరకు అభ్యర్థులను ప్రకటించింది. సీట్ల కేటాయింపుల్లో కాంగ్రెస్ పార్టీ వామపక్షాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకోకపోవడంతోనే ఒంటరిగా పోటీ చేస్తున్నామని సీపీఎం పార్టీ రాష్ట్ర నేత తమ్మినేని వీరభద్రం తెలిపారు. సీపీఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..“ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం కోసం ఇన్ని రోజులు వేచి చూశాం. కాంగ్రెస్ పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. ఇందులో భాగంగానే ఒంటరిగా బరిలోకి దిగేందుకు నిర్ణయించాం. కాంగ్రెస్ పార్టీ వామపక్షాలకు చెరొక స్థానంతో పాటు ఎమ్మెల్సీ ఇస్తాం అన్నారు. సీపీఎం మేనిఫెస్టో కూడా విడుదల చేస్తున్నాం. నల్గొండ.. కోదాడ, హుజుర్‌నగర్‌లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు త్వరలో ప్రకటిస్తాం. కొత్తగూడంలో సీపీఐ పోటీ చేస్తోంది. అక్కడ సీపీఐకి మద్దతు ఇస్తాం. సీపీఐ పోటీ చేసే చోట మేము మద్దతు ఇస్తాం” అని సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం తెలిపారు.

**సీపీఎం ప్రకటించిన అభ్యర్థులు వీరే..**

| | |
|---|---|
| పాలేరు | తమ్మినేని వీరభద్రం |
| భద్రాచలం | కారం కుల్లయ్య |
| అశ్వారావుపేట | పిట్టల అర్జున్ |
| మధిర | పాలడుగు భాస్కర్ |
| వైరా | భూక్యా వీరభద్రం |
| ఖమ్మం | ఎర్ర శ్రీకాంత్ |
| సత్తుపల్లి | మాచర్ల భారతి |
| మిర్యాలగూడ | జూలకంటి రంగారెడ్డి |
| నకిరేకల్ | బొజ్జ చిన్న వెంకులు |
| భువనగిరి | నరసింహా |
| జనగాం | మక్కు కనకరెడ్డి |
| ఇబ్రహీంపట్నం | పగడాల యాదయ్య |
| పటాన్ చెరు | మల్లికార్జున్ |
| ముషీరాబాద్ | దశరథ్ |





## మంత్రి సబితా ఇంద్రా రెడ్డి గన్‌మెన్ ఆత్మహత్య

హైదరాబాద్(వాయిస్ టుడే): మంత్రి సబితా ఇంద్రారెడ్డి గన్ మెన్ ఆత్మహత్య పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశం అయింది. కుమార్తె కళ్లెదుటే ఇవాళ గన్ మెన్ ఫజల్ అలీ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సబితా ఇంద్రారెడ్డి దగ్గర ఫజల్ అలీ అనే గన్ మెన్ కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. ఇవాళ ఆయన విధులకు వెళ్తూ కుమార్తెను వెంట తీసుకెళ్లారు. అమీర్‌పేట శ్రీనగర్ కాలనీలోని మణికంఠ హోటల్ వద్దకు రాగానే కుమార్తెతో పర్సనల్ విషయాలు మాట్లాడారు. ఈ క్రమంలోనే తన వద్ద ఉన్న గన్‌తో తలలో కాల్చుకుని ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పుల బాధతోనే ఫజల్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఫజల్ ఓ ప్రైవేటు బ్యాంకులో అప్పు తీసుకున్నట్లు కుమార్తె తెలిపింది. ఆర్థిక ఇబ్బందులతోనే ఆయన సూసైడ్ చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్లు చేయడానికి బ్యాంకునుంచి అప్పు తీసుకున్నట్లు సమాచారం. కుమార్తెల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చరిత్రనీ ఎవరూ మార్చలేరు



ఖమ్మం (వాయిస్ టుడే): చరిత్రనీ ఎవరూ మార్చలేరు ఖమ్మం అభివృద్ధిలో నా పాత్ర ఏంటో ప్రజానీకంకు తెలుసని ఖమ్మం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు . ఆదివారం నాడు హరివిల్లు అపార్ట్‌మెంట్ వాసుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తుమ్మల పాల్గొని మాట్లాడుతూ.. “ఖమ్మంలో తాగు నీటి కష్టాలు లేకుండా పిల్టర్ బెడ్స్ నిర్మాణంతో ట్యాంకర్లకు బదులు ట్యాప్‌లు తెచ్చాను. అహంకారంకు ఖమ్మం ప్రజల ప్రతిష్టకు మధ్య జరిగే ఎన్నికలు ఇవి. తెలంగాణ కల సాకారం చేసిన సోనియమ్మ రుణం తీర్చుకోవాలి. రాహుల్ గాంధీ నాయకత్వం బలపరిచేలా ఖమ్మం లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలి. నలబై ఏళ్ల రాజకీయ జీవితంలో 11వ సారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను. అరాచకం లేని ఖమ్మం కోసం, ప్రశాంతమైన ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే ఈ ఎన్నికల్లో భారీ మేజార్టీతో గెలిపించాలి” అని తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

## గజ్వేల్‌లో కేసీఆర్ బాధితులున్నారు.. వారందరికీ నేను తోడుగా ఉంటా: ఈటల



గజ్వేల్: సీఎం కేసీఆర్‌దసొంత నియోజకవర్గమైనా గజ్వేల్ లో అభివృద్ధి ఆమడదూరంలో ఉందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. ఆదివారం గజ్వేల్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో కేసీఆర్ కు నియోజకవర్గ ప్రజలు గుర్తు రాలేదని.. ఎన్నికల ముందు గుర్తొస్తున్నారని ఎద్దేవా చేశారు. నేను ఇక్కడ పోటీ చేస్తున్నాని తెలియగానే బీఆర్ఎస్ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఈటల అన్నారు. మంత్రి హరీష్ రావు గజ్వేల్‌లో ప్రచారం చేస్తే.. హరీష్ కు వ్యతిరేకంగా తాను సిద్దిపేటలో ప్రచారం నిర్వహిస్తానని హెచ్చరించారు. అధికారులు చట్టాలకు లోబడి పని చేయాలని.. అధికార పార్టీ నేతల కనుసన్నలో పని చేయకూడదని పేర్కొన్నారు. కేసీఆర్ బాధితులకు తాను అండగా నిలవనున్నట్లు తెలిపారు. గజ్వేల్ లో తిరిగిన ప్రతి చోట వాళ్ల ఓట్లు తనకే వేస్తానని చెబుతున్నారని.. అక్కడే కేసీఆర్ ఓటమి ఖాయమైందని అన్నారు. రాష్ట్రలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని వ్యాఖ్యానించారు.



## మహిళా రిజర్వేషన్ల అమలు కోసం పోరాడుతాం

హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలుకు భారత్ జాగృతి న్యాయపోరాటం చేస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం నాడు తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ..“న్యాయ నిపుణుల సలహా మేరకు సుప్రీం కోర్టులో ఇంప్లీడ్ అవుతాం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. 2024 సార్వత్రిక ఎన్నికల నుంచైనా రిజర్వేషన్లను అమలు చేసేలా చర్యలు చేపట్టాలి” అని కవిత తెలిపారు.

## నన్ను ఓడించాలని ఆ రెండు పార్టీలు చూస్తున్నాయ్..

### కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపణలు



నల్గొండ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించాలని బీఆర్ఎస్, బీజేపీ చూస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. మునుగోడులు ఇవాళ ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ ఎప్పుడో ఒకటయ్యాయని అన్నారు. వాళ్లు కుమ్మక్కయి కాంగ్రెస్‌ని రాజకీయంగా దెబ్బ కొట్టాలని చూస్తున్నారన్నారు. ప్రజలు వారి మోసాలను గమనిస్తున్నారని ఎట్టి పరిస్థితుల్లో అది జరిగే పని కాదన్నారు. కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి భంగపడ్డ చలమల్ల కృష్ణారెడ్డి పేరు నియోజకవర్గంలో ఎవరైనా విన్నారా అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ అవినీతిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాని నేరుగా కాంటాక్ట్ అయినా ఆయన నుంచి సమాధానం రాలేదన్నారు. అందుకే కల్వకుంట్ల కుటుంబంపై ఒక్క కేసు పెట్టలేదని ఆరోపించారు. రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. బీఆర్ఎస్ కు చుక్కలు చూపిస్తామన్నారు. 90 సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
ఆదివారం, 5 నవంబరు, 2023

# దేశ చరిత్రలో ఎక్కడ లేనివిధంగా దివ్యాంగులకు పింఛన్లు : మంత్రి గంగుల

కరీంనగర్ : పేద ప్రజలు సంతోషంగా ఉండాలని దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా పింఛన్లు అమలు చేస్తున్నఏకైక రాష్ట్రం తెలంగాణ అని బీసీ సంక్షేమ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం పద్మనాయక కల్యాణమండపంలో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని అవయవాలు పనిచేసినా వక్రబుద్ధితో ఉన్నవారే అసలైన దివ్యాంగులని, ఎటువంటి కల్మషం లేకపోయినా విదివశాత్తు అంగవైకల్యంతో పుట్టిన వారు దైవసమానులన్నారు. వారు సమాజంలో చులకన భావానికి గురికాకుండా సగౌరవంతో బతకాలని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4016 పింఛన్ అందిస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే వికలాంగులకు రూ.6016పింఛను అందజేస్తుందని పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి.. కేసీఆర్ గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ గౌడ్, తదితరులు ఉన్నారు.






# హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన 5కే రన్

హైదరాబాద్: నగరంలో నేడు 5K రన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని న్యూఢిల్లీలోని బీఎస్ఎన్ఎల్ బోర్డు సీఎఫ్ఏ డైరెక్టర్ శ్రీ వివేక్ బన్జాల్ ఫ్లాగ్ ఆఫ్ చేశారు. ఆదర్శ్ నగర్ BSNL భవన్ నుంచి 5కె రన్ మొదలయింది. BSNL భవన్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు కొనసాగిన పరుగును BSNL బోర్డు న్యూ ఢిల్లీ సి.ఎఫ్.ఎ డైరెక్టర్ శ్రీ వివేక్ బంజాల్, తెలంగాణ సి.జీ.ఎం సి.హెచ్. శ్రీనివాస్, ఐ.టి.పి.సి, సి.జి. ఎం గోవింద్ ప్రారంభించారు. ఈ రన్‌లో పెద్ద ఎత్తున ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సి.జీ.ఎం సి.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ..BSNL సేవలను ప్రమోట్ చేయడానికి, పాపులర్ చేయడానికి 5K రన్ ఈవెంట్ జరిగింది. గ్రామీణ ప్రాంతాలతో సహా తెలంగాణ రాష్ట్రం అంతటా హై స్పీడ్‌తో విశ్వాసనీయ బ్రాడ్‌బ్యాండ్ అంటే (ఫైబర్ టు ది హోమ్) సేవలను అందిస్తోందన్నారు, ఇది పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య డిజిటల్ విభజనను తగ్గించడంలో సహాయపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో 1.03 లక్షల FTTH కనెక్షన్‌లను అందించిందన్నారు. ప్రభుత్వం యొక్క భారత్‌నెట్ ఉద్యోగి పథకం కింద, గ్రామీణ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, వారిని వ్యాపార భాగస్వాములుగా చేయడం ద్వారా 109 గ్రామపంచాయత్‌లలో 5,400 కనెక్షన్‌లను అందించిందని తెలిపారు. తాజాగా రంగారెడ్డి జిల్లా మోమిన్‌పేట మండలం చీమలదారి గ్రామాన్ని స్మార్ట్ విలేజ్‌గా మార్చారన్నారు. BSNL ద్వారా ఇక్కడ CCTV కెమెరాలు, WiFi% హాట్‌స్పాట్‌లు, 4%+, మరియు ఆధార్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. డిసెంబర్ 2023 నుంచి లక్ష టవర్లతో భారీ స్థాయిలో 4%+% మొబైల్ సేవలను ప్రారంభిస్తోందన్నారు. ఈ టెక్నాలజీని ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద స్వదేశీంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు.



# రేవంత్ రెడ్డి బకరా అవుతారు

## బండి సంజయ్ కుమార్



హైదరాబాద్: సీఎం పొగ గాంధీ భవన్‌ను కమ్మేసిందని, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి బకరా అవుతారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. " బండి సంజయ్ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాడు. ఒకరిద్దరు చెప్తే నేను సీఎం కాను" అని వ్యాఖ్యానించారు. గంగులకు కేసీఆర్ ఇంకా బీ-ఫామ్ ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ బీసీలకు 23 సీట్లే ఇచ్చిందని, కాంగ్రెస్ 19 సీట్లే ఇచ్చిందని అన్నారు. ఆ రెండు పార్టీలు బీసీలకు వ్యతిరేకమని మండిపడ్డారు. బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

క్షుద్ర పూజలు చేయడమే కాదు.. అప్పుడప్పుడు కట్టిన ప్రాజెక్టులు కూడా చూడాలని సీఎం కేసీఆర్‌ని ఉద్దేశించి విమర్శించారు. మోటార్లు మునిగింది వాస్తవం.. ప్రాజెక్టు కుంగింది వాస్తవం.. పిల్లర్లకు పగుళ్లు వాస్తవమని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. కేసీఆర్ తిన్నదంతా కక్కిస్తామని, కాళేశ్వరం కేసీఆర్ తాత ఆస్తి కాదని అన్నారు. "కేటీఆర్ నీ అయ్యాను పట్టుకుని రా..కాళేశ్వరం దగ్గరకు నిపుణులను పట్టుకుని రా.. నా సవాల్‌కు సిద్ధమా.." అంటూ విరుచుకుపడ్డారు.

# సామాన్యులకు ఎన్నికల కోడ్ కష్టాలు



హైదరాబాద్ : తెలంగాణలో వింత పరిస్థితి ఎదురయ్యింది. ఓవైపు ఎన్నికల కోడ్.. మరోవైపు పెళ్లిళ్ల సీజన్. రెండు ఒకే సమయంలో రావడంతో కొత్త ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శుభకార్యాలు పెట్టుకున్న వారికి డబ్బుతోనే పని... ఏ పని చేయాలన్న డబ్బు అవసరం. మరోవైపు ఎన్నికల కోడ్... ఎక్కువ డబ్బు బయటకు తీసుకెళ్తే.. సీజ్ చేస్తున్నారు పోలీసులు. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి.తెలంగాణలో ఇలా ఎన్నికలు కోడ్ అమల్లోకి వచ్చిందో లేదో.. అదే సమయంలో పెళ్లిళ్ల సీజన్ కూడా ప్రారంభమైంది. అంతేకాదు... ఎన్నిక కౌంటర్ పూర్తయ్యే సమయానికి మంచి మూహూర్తాలు కూడా అయిపోతాయి. దీంతో ఈ సమయంలో శుభకార్యాలు పెట్టుకున్నారు చాలా మంది. మరి.. పెళ్లి అంటే మామూలు విషయం కాదు కదా. అంతా డబ్బుతోనే పని. షాపింగ్ దగ్గర నుంచి... మండపం బుకింగ్, మంగళవాయిద్యాలు, కేటరింగ్, డెకరేషన్ అరేంజ్‌మెంట్స్.. ఇలా ఎన్నో ఉంటాయి. వీటన్నింటికీ లక్షల రూపాయలు అవసరం అవుతాయి. కొన్ని సందర్భాల్లో నగదు తీసుకెళ్లాల్సి వస్తుంది. ఇదే.. ఇప్పుడు సమస్యగా మారింది.ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో పోలీసులు అడుగడుగునా చెకింగ్ చేస్తున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. 50 వేల రూపాయలకు మించి నగదు తీసుకెళ్తే వాటికి రసీదులు అడుగుతున్నారు. ఆధారాలు లేకపోతే నగదును సీజ్ చేస్తున్నారు. నగరాలు, పట్టణాల్లోనే కాదు... రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో కూడా పోలీసులు చెక్‌పోస్టులు పెట్టి మరీ తనిఖీలు చేస్తున్నారు. బైక్‌లను కూడా వదలడంలేదు. అనధికార లావాదేవీలు ఉంటే.. వెంటనే డబ్బు సీజ్‌చేస్తున్నారు. ఈ పరిస్థితి... పెళ్లిళ్లు పెట్టుకున్న వారికి ఇబ్బందికరంగా మారింది.పెళ్లి అంటే.. లక్షల్లో ఖర్చవుతుంది. ఆ డబ్బును... అప్పుగానో.. లేక మరో విధంగానో సమకూర్చుకుంటారు కుటుంబసభ్యులు. అందులో అన్నింటికీ లెక్కలు ఉండవు. ఇక... పెళ్లిబట్టలు కొన్నాలన్నా లక్ష రూపాయల పైమాటే. ఇక నగల సంగతి చెప్పనక్కర్లేదు. పెద్ద మొత్తం ఖర్చుపెట్టాల్సి ఉంటుంది. అయితే.. షాపింగ్‌కు డబ్బుతో వెళ్లే సమయంలో పోలీసులు ఆపితే... వారి పరిస్థితి ఏంటి. పోలీసులు నచ్చజెప్పి.. డబ్బుతో బయటపడేసరికి తలప్రాణం తోక్కొస్తుంది. ఇలాంటి అనుభవం ఇప్పటికే చాలా మందికి ఎదురైందట. దీంతో ఇదేం ఎన్నికల కోడ్, ఇవేం తిప్పలు అంటూ తలలు పట్టుకున్నారు పెళ్లింటి వారు. పోనీ, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పెళ్లిళ్లు, శుభకార్యాలు పెట్టుకుందామా అంటే... ఎన్నికల కోడ్ ముగిసే సరికి.. పుణ్యకాలం కాస్త గడిచిపోతుంది. కోడ్ ముగిసే సమయానికి... శుభముహూర్తాలు కూడా అయిపోతాయట. ఇక చేసేది ఏమీ లేక... కోడ్ కష్టాలు అనుభవిస్తున్నారట.ఎన్నికల కోడ్ వల్ల.. శుభకార్యాలు పెట్టుకున్న వారికే కాదు... అత్యవసరం కోసం డబ్బులు అప్పుగా ఇచ్చేవారు కూడా... పోలీసుల తనిఖీల వల్ల వెనకడుగు వేస్తున్నారట. ఆ డబ్బు ఎక్కడిది అని పోలీసులు అడిగితే ఏం చెప్పాలో తెలియక.. అత్యవసరానికి అప్పు అడిగినా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారట. దీంతో సామాన్యులు ఇబ్బందులు పడక తప్పని పరస్థితి ఏర్పడింది. అత్యవసర ట్రీట్‌మెంట్ కోసం హాస్పిటల్స్‌లో బిల్లులు చెల్లించేందుకు కూడా కొందరు కష్టాలు పడుతున్నారు. దాచుకున్న సొమ్ముకు ఆధారాలు ఎక్కడి నుంచి తేగలమని ప్రశ్నిస్తున్నారు.



# బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తయారు చేసిన కార్లు సీజ్

హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తయారు చేసిన కార్లను ఎన్నికల కమిషన్ ఫిర్యాదు మేరకు బేగంబజార్ పోలీసులు సీజ్ చేశారు. నాంపల్లిలోని గాంధీ భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పదేళ్లలో జరిగిన వైఫల్యాలు, నిరుద్యోగులను మోసం చేశారంటూ వివరాలతో కూడిన ప్రత్యేకంగా తయారు చేసిన మూడు అంబాసిడర్ కార్లను బేగంబజార్ పోలీసులు సీజ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కలర్ వేయించి అందరూ చూసే విధంగా గాంధీ భవన్ పార్కింగ్ యార్డ్‌లో ఉంచిన కార్లపై ఎన్నికల నిర్వహణ ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు బేగంబజార్ పోలీసులకు కార్లను సీజ్ చేయాలని ఫిర్యాదు చేశారు. దీంతో బేగంబజార్ పోలీసులు మూడు కార్లను సీజ్ చేసి గోషామహల్ స్టేడియంకు తరలించారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్లకు నెంబర్ ప్లేట్‌పై కేసీఆర్ 420 , నిరుద్యోగ భృతి ఆరు వేల కోట్ల బాకీ , బీఆర్ఎస్ ప్రభుత్వం 20 లక్షల మంది రైతులను ముంచింది. ప్రభుత్వం కట్టించిన అడపాదడపా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అల్లుడు వస్తే ఎక్కడ పడుకోవాలి, సంక్షేమ పథకాలల్లో కేసీఆర్ 30 శాతం కమిషన్, పదేళ్లు పూర్తవుతున్న ఇంటికో ఉద్యోగం ఎక్కడికి పాయే అంటూ రాతలు రాసి పబ్లిక్ సందర్శన కోసం గాంధీ భవన్ లో ఈ కార్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇతర పార్టీలను కించపరిచే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించవద్దని ఎన్నికల కమిషన్ అధికారులు హెచ్చరించారు. ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేసి క్రేన్ సహాయంతో గోషామహల్ పోలీస్ స్టేడియంకు తరలించారు.



# హోం మంత్రి మహమూద్ అలీ కాన్వాయ్‌ని తనిఖీ చేసిన పోలీసులు

మెదక్ : హోం శాఖ మంత్రి మహమూద్ అలీ కాన్వాయ్‌ని పోలీసులు ఆదివారం తనిఖీ చేశారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కళ్లకల్ చెక్ పోస్ట్ వద్ద ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి పోలీసులకు మంత్రి మహమూద్ అలీ పూర్తిగా సహకరించారు. మంత్రి వాహనంతో పాటు ఆయన వెంట ఉన్న ఇతర వాహనాలను సైతం పోలీసులు చెక్ చేశారు. తనిఖీకి సహకరించిన మంత్రికి పోలీసులు ధన్యవాదాలు తెలిపారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు కాదు కాంట్రాక్టర్ల ప్రాజెక్టు: కోదండరామ్



హుస్నాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు కాదని, కాంట్రాక్టర్ల ప్రాజెక్టు అని, కాంట్రాక్టర్ల జేబులు నింపే ప్రాజెక్ట్ అయ్యిందని జనసమితి పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. తొమ్మిదిన్నర సంవత్సరాలలో తెలంగాణ ప్రభుత్వం ఇరిగేషన్‌పై లక్ష కోట్లు ఖర్చుపెట్టినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందని ఆయన ఆరోపణలు గుప్పించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాజెక్టులో రూ.25 వేల కోట్లు గల్లంతయ్యాయని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పనికిరాకుండా పోయాయని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ కట్టినప్పుడు గ్రామస్థుల దగ్గర తక్కువ డబ్బులకే భూములు గుంజుకున్నారని, వారికి న్యాయం జరగకుండానే రాత్రిపూట కొట్టి బుల్డోజర్లతో కూల్చి గ్రామాన్ని ఖాళీ చేయించారని, కానీ ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.

# రాజేంద్రనగర్‌లో లాడ్జీలపై పోలీసుల దాడులు



హైదరాబాద్: నగరంలోని రాజేంద్రనగర్‌లో లాడ్జీలపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు సోదాలు నిర్వహించారు. ఎన్నికల దృష్ట్యా తనిఖీలు చేపట్టినట్లు డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. లాడ్జీలలో బస చేసిన వారి వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని డీసీపీ లాడ్జీ నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ఉచిత సామాగ్రి, డబ్బును లాడ్జీలలో దాచిపెట్టి పంచ్చే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.